



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



విశ్వకర్మ భగవానునికి పూజలు చేసిన అనంతరం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని సన్మానిస్తున్న విశ్వకర్మ ఐక్య సంఘం నాయకురాలు మంజులా అశోక్‌చారి



సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని సంఘ భవనంలో విశ్వకర్మ భగవానుని జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డిని విశ్వకర్మ ఐక్య సంఘం మహిళా నాయకురాలు మంజులా అశోక్‌చారి శాలువాతో ఘనంగా సన్మానించారు. సాయంత్రం శోభాయాత్ర చేపట్టారు. మహిళల కోలాటం, కళాకారుల నృత్యాలతో ఈ శోభాయాత్ర ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కూన వనిత, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్ల అశోక్‌చారి, ఉపాధ్యక్షుడు వి.బ్రహ్మంచారి, మోహన్‌చారి, కమ్మరి పద్మ, మనుబ్రహ్మ ఝాన్సీ, కమ్మరి సంగీత తదితరులు పాల్గొన్నారు.



ఏడేళ్లుగా అదే మట్టి దారి

అసంపూర్తిగా దాతర్‌పల్లి - పోతిన్‌పల్లి రోడ్డు పనులు

మెదక్ జిల్లాలోని తూప్రాన్ మండలం దాతర్‌పల్లి నుంచి మాసాయిపేట మండలం పోతిన్‌పల్లి గ్రామానికి ఏడేళ్ల క్రితం మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రోడ్డు పనులు నేటికీ పూర్తి కాలేదు. 2018లో 'కంటి వెలుగు' పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఒక గ్రామస్థుడు చేసిన విజ్ఞప్తి మేరకు, గడ ప్రత్యేక నిధుల నుంచి రూ.3 కోట్లు కేటాయించారు. 2019 డిసెంబర్‌లో శంకుస్థాపన చేసినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ఆరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. గతంలో వేసిన కంకర కూడా వర్షాలకు కొట్టుకుపోయింది. దీనిపై పీఆర్ ఏఈ మధుసూదన్ కాంట్రాక్టర్‌కు రెండు నోటీసులు జారీ చేయగా, వర్షాలు తగ్గిన తర్వాత పనులు పూర్తి చేస్తానని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చాడు. దాతర్‌పల్లి - పోతిన్‌పల్లి మట్టి రోడ్డు ఎప్పటికి పూర్తవుతుందో చూడాలి.

- తూప్రాన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డి అదనపు ఎస్పీగా రఘునందన్‌రావు బాధ్యతల స్వీకరణ



సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా సీహెచ్ రఘునందన్‌రావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. 1995 బ్యాచ్‌లో ఎస్‌ఐగా విధుల్లో చేరిన రఘునందన్‌రావు అంచెలంచెలుగా ఎదుగుతూ అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో కొంతకాలం డీఎస్పీగా విధుల నిర్వహించిన ఆయనకు అదనపు ఎస్పీ ప్రమోషన్ లభించింది. దీంతో ఆయన సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చి అదనపు ఎస్పీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ పరితోష్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పూల జాతరకు వేళాయే


రేపటి నుంచి బతుకమ్మ పండుగ

వేడుకలకు సిద్ధమైన పల్లె, పట్టణం

7



ట్రాన్స్‌కో సంస్థలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ముఖ్యంగా, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ట్రాన్స్‌కో అధికారులపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ప్రత్యేకంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఇబ్రహీంబాగ్ ట్రాన్స్‌కో ఏడీఈ అంబేడ్కర్ రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులతో ఏసీబీకి పట్టుబడటంతో, సమీపంలోని సంగారెడ్డి జిల్లాలోని పలువురు ఏడీఈల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



ఆంధ్రజ్యోతిలో విద్యుత్‌శాఖ అవినీతిపై ప్రచురితమైన కథనాలు

ఏడీఈలకు షాక్

ట్రాన్స్‌కోలో అవినీతి అధికారులపై సీఎంవో ఆరా

- సంగారెడ్డి జిల్లా నుంచి చేరిన జాబితా
- ఫోకల్ ఏరియాల్లోనే ఏళ్ల తరబడి తిష్ఠ వేసిన అధికారులు
- విద్యుత్ సామగ్రి అక్రమ విక్రయాలపై విజిలెన్స్ నిఘా

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీఎంవోకు చేరిన జాబితాలో ఒక అధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ అధికారి పటాన్‌చెరు ప్రాంతంలోని ఒక వెంచర్‌కు కేటాయించిన ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాలు వంటి విద్యుత్ సామగ్రిని బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుల్తాన్‌పూర్‌లోని సర్వే నంబర్లు 364, 366, 367 ఉన్న ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీ లేఅవుట్‌కు సంబంధించిన ఈ కుంభకోణంపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైంది. అప్పట్లో విజిలెన్స్ అధికారులు దీనిపై దర్యాప్తు చేసినప్పటికీ, ఇప్పుడు ఈ అధికారి పేరును కూడా సీఎంవోకు సమర్పించిన జాబితాలో చేర్చినట్లు సమాచారం. ఈ అధికారి

మిగతా 8వ పేజీలో

ముఖ్యమంత్రి కార్యాలయానికి 17 మంది ఏడీఈల జాబితా

విజిలెన్స్ విభాగం రెండు రోజుల క్రితం హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని 17 మంది ఏడీఈల జాబితాను సీఎంవోకు అందజేసింది. ఇందులో సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న కొంతమంది ఇంజనీర్ల పేర్లు కూడా ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. వీరి అక్రమాలపై సీఎంవో ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

హాస్టళ్లలో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- చేగుంట బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ



చేగుంట బీసీ హాస్టల్‌లో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అన్ని గురుకులాలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం చేగుంటలోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మరుగుదొడ్లు, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను కూడా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని చెప్పారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా ఉండేందుకు, భవనాల లీకేజీ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన పనులను తక్షణమే చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ఏ గురుకులంలోనైనా అత్యవసర మరమ్మతులు అవసరమైతే, వాటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పూర్తిస్థాయిలో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జై భరత్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ రమేష్, హౌసింగ్ ఏఈ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



దిగువకు 2,11,290 క్యూసెక్కులు

- సింగూరు నుంచి నాలుగు రోజుల్లోనే దాదాపు 18 టీఎంసీలు విడుదల

పుల్‌కల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కర్ణాటక, మహారాష్ట్రతో పాటు సంగారెడి జిల్లాలోని పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలతో సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. నాలుగు రోజుల క్రితం గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయగా, శుక్రవారం నాటికి 2,11,290 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు వదిలారు. ఇది దాదాపు 18 టీఎంసీలకు సమానం. నెల రోజులుగా నిరంతరం వరద జలాలు వస్తుండటంతో దిగువకు వదులుతూనే ఉన్నారు. మొత్తంగా ఇప్పటివరకు సుమారు 200 టీఎంసీలకుపైగా వరద నీరు గోదావరిని చేరింది. ప్రాజెక్టు గురువారం వరకు ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా వరద జలాలను విడుదల చేసిన నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం మరో గేటును ఎత్తారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 57,237 క్యూసెక్కులుగా నమోదైంది. వరద ప్రవాహం మరింత ఎక్కువ కాగా, మధ్యాహ్నం 3 గంటలకు 14వ క్రస్ట్‌గేట్‌ను ఎత్తారు.ఏడు క్రస్ట్‌గేట్ల ద్వారా 56,597 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్నది. జల విద్యుత్ ఉత్పత్తి గేటు, ఎడమ కాలువ, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు కలిపి మొత్తం ఔట్‌ఫ్లో 59,037 క్యూసెక్కులుగా నమోదైంది. సింగూరు ప్రాజెక్టులో 520.695 మీటర్ల నీటి సామర్థ్యానికి 17.199 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ నాలుగు క్రస్ట్ గేట్లను ఐదు మీటర్ల ఎత్తు, ఒక స్కవర్ గేట్ మీటరున్నర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే వనదుర్గా ప్రాజెక్టుకు (ఘనపురం)కు వదులుతున్నారు. 55,223 క్యూసెక్కుల వరద దిగువకు పారుతుంది.



మంజీర రిజర్వాయర్



ఏడుపాయల వద్ద...



నాందేడ్- అకోల ప్రధాన రహదారిపై పారుతున్న పెద్దచెరువు నీరు

అలుగు దూకి.. హైవేపై నుంచి పారి..

జోగిపేట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అందోల్- జోగిపేట మున్సిపల్ పరిధిలోని అందోల్ పెద్దచెరువు నిండుకుండలా మారింది. వర్షపు నీటితో పాటు సింగూరు జలాశయం కెనాల్ లింకు ద్వారా నీరు చెరువులో చేరడంతో అలుగు దూకింది. ఈ వరదంతా అందోల్ ఆర్డీవో కార్యాలయం వద్ద నాందేడ్- అకోల ప్రధాన రహదారిపై నుంచి పారుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌కు చెందిన ముఖేష్‌యాదవ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ఇంద్రేశంలో తక్కువ ధరకు నాలుగో అంతస్తులో ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. కొంతకాలానికి ఇంటి లోపల అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక వాహనం అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోకి వెళ్లే పరిస్థితి లేదు. రోడ్డుపై వాహనాన్ని నిలబెడదామంటే 20 అడుగులే దారే ఉంది. అయినా మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

నిబంధనలను ఉల్లఘించి నిర్మాణాలను చేపట్టడంతో జరిగిన నష్టమిది. నగర శివారుల్లో అనుమతులకు మించి అక్రమ అంతస్తులతో నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది.



అనుమతలకు మించి అంతస్తులతో నిర్మిస్తున్న భవనం

అక్రమ అంతస్తులకు అడ్డుకట్టేదీ?

- అనుమతులకు మించి నిర్మాణాలు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికార యంత్రాంగం

పటాన్‌చెరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇస్నాపూర్, ఇంద్రేశం, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపల్ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉండడంతో సొంతింటి కల నెరవేర్చుకోవడానికి చాలామంది ఇక్కడ స్థిరపడాలని చూస్తున్నారు. దీన్ని అక్రమార్కులు ఆసరాగా తీసుకుని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. జీ+2 అంతస్తుల వరకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ, కొందరు బిల్డర్లు జీ+3, జీ+4 జీ+5 అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం గాలి, వెలుతురుకు కేటాయించాల్సిన ఖాళీ స్థలాన్ని వదలడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనాలు తిరగడానికి స్థలం ఉండడం లేదు.

అనుమతులు లేకున్నా రిజిస్ట్రేషన్లు

అక్రమ నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు జరగడం మరింత ఆందోళన కలిగించే అంశం. అనుమతులు లేని ఫ్లాట్లను అధిక ధరలకు అమ్ముతున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక ఫ్లాట్‌కు రూ. లక్ష నుంచి రూ.2.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు నిర్వహించి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేసినప్పటికీ, అక్రమాలు మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిషేధించిన స్థలాల్లో నిర్మించిన భవనాలకు సైతం రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఐడీఏ బొల్లారం మున్సిపల్ పరిధిలో చెరువులు, హుడా భూములను ఆక్రమించి నిర్మించిన విల్లాలకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ అక్రమాలకు అధికారులు సహకరిస్తున్నారని, డబ్బులిస్తే ఎలాంటి అక్రమ నిర్మాణాలకైనా అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్

పాపన్నపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి గ్రామ శివారు నుంచి గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి వెళ్లి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మంజీరా నది, చెరువుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు

చేగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం కేంద్రంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీ బాలాజీ పేపర్ ప్లేట్ తయారీ పరిశ్రమలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రామయంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం జరగలేదు. శుక్రవారం తెల్లవారు జామున గురుమూర్తి కిరాణాదుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఫ్రిజ్‌లో నుంచి పొగలు రావడంతో అప్రమత్తమైన యజమాని మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు ఫ్రిజ్‌లు పూర్తిగా కాలిపోయాయి మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని యజమాని తెలిపారు.


పేపర్ ప్లేట్ పరిశ్రమంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ..

●కారు బోల్తా పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి శ్రీత

పుల్‌కల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తూ టైరు పగిలి ఇన్నోవా కారు బోల్తా పడిన సంఘటనలో ఓ చిన్నారి మృతి చెందగా, మరో ఆరుగురికీ గాయాలయ్యాయి. మండల కేంద్రమైన చౌటకూర్‌కు సమీపంలో అకోలా 161 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున ఈ సంఘటన జరిగింది. పుల్కల్ ఎస్సై ఎస్.విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డినగర్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన తాళ్ల గౌతమ్‌గౌడ్ తన భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు, డ్రైవర్‌తో కలిసి ఈ నెల ఇన్నోవా కారులో షిర్డీ యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై చౌటకూర్ శివారులోకి రాగానే ఇన్నోవా కారు వెనుకభాగంలోని ఎడమ వైపు టైరు పగిలింది. దీంతో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో వాహనంలోని వారందరికీ గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారందరిని ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ప్రధానాసుపత్రికి తరలించారు. గౌతమ్‌గౌడ్ మూడేళ్ల కూతురు శ్రీతకు బలమైన దెబ్బలు తగలడం వల్ల మృతి చెందిందని డాక్టర్లు తెలిపారు. మిగిలిన వారందరు గాయాలతో బయటపడ్డారు. గౌతమ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్సై ఎస్.విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.















పూల జాతరకు వేళాయే





- రేపటి నుంచి బతుకమ్మ పండుగ
- వేడుకలకు సిద్ధమైన పల్లె, పట్టణం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకు ఇచ్చేది బతుకమ్మ. కలిసి బతకమని చెప్పేది బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, జీవన విధానాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా తెలంగాణ అంతటా సందడి నెలకొంటుంది. ఖరీఫ్ పంటలు ఇంటికి చేరే సమయంలో ఈ పండుగ రావడం విశేషం. వలస వెళ్లిన వారు, పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు ఈ పండుగ కోసం తమ గ్రామాలకు తిరిగి వస్తారు. ఏడాదంతా పడ్డ కష్టాలు, బాధలు మరిచిపోయి తొమ్మిది రోజులు పండుగలో మునిగి తేలుతారు.

తొమ్మిది రోజుల పండుగ విశేషాలు

బతుకమ్మ పండుగ మహాలయ అమావాస్య (పెత్త రామాస) రోజున ప్రారంభమై, సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఈ తొమ్మిది రోజులు ప్రతి సాయంత్రం మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని గ్రామ చావిడికి చేరుకుంటారు. అక్కడ ఒకరి పక్కన ఒకరు గుండ్రంగా తిరుగుతూ, చేతులతో లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. ఈ పాటల్లో పుట్టింటి ప్రేమలు, అత్తింటి ఆరళ్లు వంటి సామాజిక అంశాలు ప్రతిబింబిస్తాయి. తొమ్మిదో రోజున వచ్చే సద్దుల బతుకమ్మ పండుగ అత్యంత ప్రధానమైనది. ఆ రోజు మహిళలు పోటీపడి బతుకమ్మలను పేర్చుతారు. వివిధ రకాల సద్దులను తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆటలు పాటలు పూర్తయ్యాక, బతుకమ్మలను చెరువులు, కాల్వల్లో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత చక్కెర, రొట్టెతో చేసిన మలీద అనే వంటకాన్ని బంధువులకు పంచిపెడతారు.

సిద్ధమైన ఉమ్మడి జిల్లా

తొమ్మిది రోజుల పూల పండుగకు ఉమ్మడి జిల్లా సిద్ధమైంది. ఆడపడుచులు బతుకమ్మలు పేర్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని విద్యా సంస్థల్లో ముందస్తు వేడుకలు జరుగుతున్నాయి.

బతుకమ్మ చరిత్ర, ఆచారాలు

బతుకమ్మ పండుగకు పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనం ప్రకారం, మహిషాసురుడితో పోరాడి అలసిపోయిన పార్వతీదేవి (గౌరీదేవి) మూర్ఛపోగా, ఆమెను పూలతో బతుకమని స్తుతించారని చెబుతారు. మరొక కథనం ప్రకారం, సంతానం లేని ఒక రైతు దంపతులకు ఏడుగురు పిల్లలు పుట్టి చనిపోగా, ఆఖరి బిడ్డకు బతుకమ్మ అని పేరు పెట్టడంతో ఆమె బతికిందని అంటారు.

కనుమరుగవుతున్న పూలు

గతంలో బతుకమ్మను తంగేడు, గునుగు, చామంతి, బంతిపూలతో పేర్చేవారు. అయితే వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ పూల లభ్యత తగ్గిపోయింది. ముఖ్యంగా పత్తి పంట ఎక్కువగా వేస్తుండటంతో గునుగు పూలు దొరకడం కష్టంగా మారింది. దీనితో మార్కెట్‌లో కాగితపు బతుకమ్మల అమ్మకాలు పెరిగాయి.

రోజుకో నైవేద్యం..

బతుకమ్మకు తొమ్మిదిరోజులపాటు రోజుకు ఒక ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు.

- మొదటి రోజు (ఎంగిలి పువ్వు బతుకమ్మ): నువ్వులు, బియ్యం పిండి, నూకలు.
- రెండో రోజు (అటుకుల బతుకమ్మ): సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు.
- మూడో రోజు (ముద్దపప్పు బతుకమ్మ): ముద్దపప్పు, బెల్లం, పాలు.
- నాలుగో రోజు (నానే బియ్యం బతుకమ్మ): నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం.
- ఐదో రోజు (అట్ల బతుకమ్మ): అట్లు లేదా దోశ.
- ఆరో రోజు (అలిగిన బతుకమ్మ): ఈ రోజు నైవేద్యం ఉండదు.
- ఏడో రోజు (వేపకాయల బతుకమ్మ): బియ్యం పిండిని వేయించి, వేప పండ్లలా తయారు చేసి నైవేద్యం.
- ఎనిమిదో రోజు (వెన్నముద్దల బతుకమ్మ): నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం.
- తొమ్మిదో రోజు (సద్దుల బతుకమ్మ): ఐదు రకాల సద్దులు.



సంగారెడ్డి జిల్లా కోర్టు ముందు తాడుతో చేసిన సంకెళ్లతో చేతులు బంధించుకొని ధర్నా చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

- కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. నాంపల్లి, నాగర్‌కర్నూల్‌లో న్యాయవాదులపై జరిగిన దాడికి నిరసనగా సంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం వినూత్నంగా తాడుతో చేసిన సంకెళ్లతో చేతులు బంధించుకుని జిల్లా కోర్టు ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకొచ్చేవరకు ఈ ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు మల్లేశం, శ్రీకాంత్, శ్రీనివాస్, మంజుల రెడ్డి, బుచ్చయ్య, సుభాష్ చంద్ర, నరసింహ, మాణిక్ రెడ్డి, రాములు, దత్తాత్రి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సదస్సులో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన ఆమె మాట్లాడుతూ గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయ సహాయం కోసం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. 23న నిర్వహించాల్సిన ఎంపికలను వివిధ కారణాల వల్ల నేడు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని వివరించారు. అండర్-19 బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పదవ తరగతి మెమో, బోనోఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9440686408, 9848321330 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మత్తడి పారుతున్న చేర్యాల పెద్దచెరువు





నిండుకుండలా మారిన చేర్యాల పెద్దచెరువు, పారుతున్న మత్తడి

చేర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు మత్తడి పారుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీటికి తోడు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన గోదావరి జలాలు చేరడంతో గురువారం నిండుకుండలా మారింది. శుక్రవారం ఉదయం అలుగు పారడంతో మత్స్యకారులు చేపలు పట్టారు. చాలాకాలం తరువాత మత్తడి దూకడంతో చెరువు వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది. గతంలో పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు పనులు చేపట్టినప్పటికీ అర్ధాంతరంగా నిలిచి ఏళ్లు గడుస్తున్నాయి. ప్రస్తుతం చెరువులో నీరు చేరడంతో త్వరగా సుందరీ కరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులు ఎలా కొనసాగుతున్నాయి

- కొండాపూర్‌లో మహారాష్ట్ర అధికారులు ఆరా



తొగర్‌పల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న మహారాష్ట్ర అధికారులు

కొండాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల తీరు, జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్వహణ, విధివిధానాలపై మహారాష్ట్ర అధికారులు ఆరా తీశారు. శుక్రవారం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా కలెక్టర్ అంజలి, 11 మంది అధికారుల బృందం తొగర్‌పల్లి గ్రామ పంచాయతీ, కొండాపూర్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. తొగర్‌పల్లి గ్రామ పంచాయతీలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలో మొక్కల పెంపకం, చెత్త సేకరణతో ఎరువుల తయారీని పరిశీలించారు. పంచాయతీ విధి నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టంపై ప్రజలకు అవగాహన ఎలా ఉంటుందని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇంటి నిర్మాణపు పనులను పర్యవేక్షించారు. మహిళల సహాయక, యువజన సంఘాల సభ్యుల అభివృద్ధి, నిర్వహణ, ఉత్పత్తులు, విక్రయాలు, పనులతో కుటుంబాల జీవనం ఎలా మారుతుందో ఆరా తీశారు. డీఆర్డీవో బాలరాజ్, ఏపీడీ పూజ, ఎంపీడీవో వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి పనులు, స్థానిక సంస్థల విధి విధానాలు, ఉపాధిని బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్, ఏపీవో వీరప్ప, పీఆర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి సౌజన్య, జీపీ కార్యదర్శులు నర్సమ్మ, సాయి, ఈసీ గణేష్, టీఏ శ్రీనివాస్, సాయిలు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీవీఆర్ఐటీలో 'ఇమాజిన్ జపాన్' పెయింటింగ్ పోటీలు



పెయింటింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నర్సాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ కాలేజీలో జపాన్ సంస్కృతిని ప్రతిబింబిస్తూ 'ఇమాజిన్ జపాన్' పెయింటింగ్ పోటీని శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను గ్రాడ్యుయేట్ స్టడీ అబ్రాడ్ సెంటర్, జపాన్ భాషా విభాగం సంయుక్తంగా నిర్వహించగా 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జపాన్ సంస్కృతి, సంప్రదాయాలు, ఆవిష్కరణలను తమ కళాత్మక సృజనాత్మకతతో కాన్వాస్‌పై చిత్రించారు. ఈ కార్యక్రమానికి సాగా యూనివర్సిటీ జపాన్ నుంచి ప్రొఫెసర్ డాక్టర్ యుకియో నాగనో, కురుమే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జపాన్ నుండి ప్రొఫెసర్ డాక్టర్ షుచిటోరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో విద్యార్థులు, అధ్యాపకులకు జపాన్ విద్యా సంబంధ అంశాలు, సంస్కృతిపై అవగాహన కల్పించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ డైరెక్టర్ లక్ష్మి ప్రసాద్, డీన్ రాజు ఎడ్ల, ప్రతినిధులు ప్రణీత, లవీనా అరోరా, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్షాటన చేసి నిరసన తెలిపిన వర్కర్లు



సిద్దిపేటలో బిక్షాటన చేస్తున్న వర్కర్లు

సిద్దిపేట కల్చరల్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటింజెంట్ వర్కర్ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ నెల 12 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం సిద్దిపేట, మెదక్‌లో బిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలకు పని చేస్తున్నామన్నారు. నెలల తరబడి వేతనాలు అందక.. అప్పులు చేయలేక.. వస్తులు ఉండలేక.. దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం చెల్లిస్తున్న వేతనాలు గతంలో రూ13,400 ఉండగా, ప్రస్తుతం రూ.10,400లకు తగ్గించి, చెల్లించడం దారుణమన్నారు. తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన వర్కర్ల స్థానంలో బాధిత కుటుంబంలో ఒకరికి పని కల్పించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరవధిక సమ్మెలో జిల్లా నాయకులు రమేష్, లక్ష్మి, సురేష్, స్వామి, కనకయ్య, పరశురాములు, మెదక్ వర్కర్స్ యూనియన్ సభ్యులు రాంచందర్, మాధవి, సునంద, శేఖర్, సువర్ణ, జ్యోతి, పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇక.. నేనెట్ల బతకాలే..!

- ఓ వృద్ధురాలి ఆందోళన
- భర్త పేరిట ఉన్న భూమి కుమారులకు..
- ఇద్దరూ చనిపోవడంతో వారి భార్యలకు..



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వృద్ధురాలు

మనోహరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఇద్దరు కుమారులు.. ఓ కుమార్తె వేర్వేరు సమయాల్లో ఇద్దరూ చనిపోయారు. అంతకు ముందే భర్త చనిపోవడంతో ఉన్న ఆస్తిని కుమారుల పేరిట మార్చింది. ఏ ఆసరా లేకపోవడంతో కుమార్తె దగ్గర ఉంటోంది. పెద్ద కుమారుడి భార్య తన భర్త పేరిట ఉన్న భూమిని అనుభవిస్తోంది. రెండో కుమారుడి పేరిట ఉన్న భూమి తనకే దక్కాలంటూ అతని భార్య తహసీల్దార్‌ను ఆశ్రయించగా, ఆయన గురువారం ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అయితే, ఉన్న భూమి తీసుకుంటే తానేం కావాలని.. తనను ఎవరు చూసుకుంటారని తల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగింది. ఇద్దరు కుమారులు చనిపోవడం.. ఉన్న భూమి ఇద్దరు కోడళ్లు తీసుకోవడంతో ఆ వృద్ధురాలు ఇక తనను ఎవరు చూసుకుంటారంటూ ఆందోళనకు దిగింది.

తూప్రాన్ మండలం మనపూర్ గ్రామానికి చెందిన గంగా మాధవికి భర్త రాములు గతంలోనే మృతి చెందాడు. వీరికి మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామంలో 33 గుంటల భూమి ఉంది. దీంతో భర్త రాములు పేరు మీద ఉన్న భూమిని ఇద్దరు కుమారుల పేరిట మార్చింది. పెద్ద కుమారుడు కుమార్ పెళ్లి అయిన ఆరు నెలలకు కరోనా సమయంలో మృతి చెందాడు. అతని భార్య పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. చిన్న కుమారుడు గౌరి శంకర్‌కు 2022లో పెళ్లి కాగా, 2024లో గోడకూలి చనిపోయాడు. దీంతో అతని భార్య కూడా తల్లిగారి ఇంటి వద్దే ఉంటోంది. ఏకాకి అయిన తల్లి తన కుమార్తె వద్ద హుస్నాబాద్‌లో ఉంటోంది. చిన్న కుమారుడి పేరిట ఉన్న భూమి తన పేరిట చేయాలని చిన్న కోడలు ఏడాదిగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. ఈ క్రమంలో తహసీల్దార్ ఇద్దరినీ పిలిచి మాట్లాడారు. అయినా, వారు ఒక ఒప్పందానికి రాలేదు. తాజాగా మరోమారు గంగా మాధవికి నోటీసు పంపినా, ఆమె రాలేదు. భర్త పేరిట ఉన్న భూమి చట్ట ప్రకారం భార్యకు దక్కుతుందని గురువారం తహసీల్దార్ కోడలు సునిత పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో గంగా మాధవి శుక్రవారం కార్యాలయం వద్దకు వచ్చి ఆందోళనకు దిగింది. తనకు ఎవరూ లేరని, ఏ ఆధారం లేని తనను ఇక ఎవరు చూస్తారని ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు వచ్చి ఆమెకు నచ్చజెప్పి పంపించారు. ఈ విషయంలో తహసీల్దార్ ఆంజనేయులును సంప్రదించగా, ఈ భూమి విషయంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చామని, వారు ఓ ఒప్పందానికి రాకపోవడంతో చట్ట ప్రకారం భర్త పేరిట ఉన్న భూమిని భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేశామని వివరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అహ్మదీపూర్ విద్యార్థిని



గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం డిల్లీ పబ్లిక్ స్కూల్ పటాన్‌చెరులో జరిగిన జోనల్ స్థాయి చెస్ టోర్నమెంట్‌లో అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మాధవి, 9వ తరగతి అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుగుణాకర్ తెలిపారు.



వైద్యులు తొలగించిన 15 కిలోల కణితి

15 కిలోల కణితిని తొలగించిన వైద్యులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ శివారులోని మహేశ్వర మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో శుక్రవారం వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్‌కు చెందిన ముంతాజ్(55) 3 సంవత్సరాలుగా కడుపునొప్పి, పొట్ట పెరగటం వంటి సమస్యలతో బాధపడుతున్నది. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ఆమె చివరకు మహేశ్వర ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. వారు ఆమెకు పరీక్షలు నిర్వహించి అండాశయంలో 15 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. యాజమాన్యం ముంతాజ్ విషయంలో తమవంతు సామాజిక బాధ్యతగా అతి తక్కువ ఖర్చులోనే వైద్యాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. ముంతాజ్ వయసు, ఆరోగ్యం దృష్ట్యా శస్త్రచికిత్స ప్రమాదకరం అయినప్పటికీ రిస్క్ తీసుకుని లాపరోటమీ ద్వారా తన అండాశయంలోని కణితిని తొలగించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆడమ్ తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్లు శ్రీనివాస్, హేమంత్, భావనారెడ్డి, అంకాలజీ విభాగం వైద్యుడు శంకర్‌రెడ్డి, సర్జరీ విభాగం డాక్టర్ సూర్యతేజ, స్త్రీల వైద్య విభాగం డాక్టర్ అరుణ, అపర్ణ, సుప్రియ, డాక్టర్ శివలత, ఆకాంక్ష తదితర నిపుణులు పాల్గొన్నారు.

ఇట్లయితే వ్యవసాయం ఎలా చేసుకోవాలి?

- వరదనీటిలో పరిశ్రమల రసాయన జలాల పారబోతతో పంటలు నాశనం
- సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- అధికారులకు దోమడుగు గ్రామస్థుల మొర



నల్లకుంట చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశం, వివిధ పార్టీ నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): " వర్షం పడిందంటే పంట పొలాలు పచ్చగా మారాలి.. కానీ మా గ్రామంలో ఎర్రగా మారుతున్నాయి.. పరిశ్రమల నుంచి విచ్చలవిడిగా వెలువడుతున్న రసాయన జలాలు వరదతో పాటు వచ్చి చెరువుల్లోకి, మా పొలాల్లోకి చేరుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పంటలు పండించాలి? ఎలా జీవించాలి?.." అంటూ మండలంలోని దోమడుగు గ్రామస్థులు అధికారులతో తమ గోడును వెల్లబోసుకున్నారు. వర్షాలతో దోమడుగులోని నల్లకుంట చెరువు పరిశ్రమల రసాయన జలాలతో నిండిపోయింది. ఫలితంగా చుట్టుపక్కల పొలాలకు ఆ జలాలు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతింటున్నాయి, భూమి నాణ్యత తగ్గిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ దశరథ్, తహసీల్దార్ పరమేశం, వివిధ రాజకీయ పార్టీ నాయకులు నల్లకుంట చెరువును సందర్శించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కాలుష్య జలాలతో పంట పొలాలను నాశనమవుతున్నాయన్నారు. తాత్కాలిక చర్యలు కాకుండా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేయడం అసాధ్యం మొరపెట్టుకున్నారు. స్పందించిన అధికారులు సమస్యను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని, తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గతంలో కూడా ఇలాంటి హామీలిచ్చి విస్మరించారని గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల జీవనాధారమైన పంటల సాగుకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల కాలుష్య జలాలను నిరోధించే శాశ్వత పద్ధతులు అమలు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, గ్రామస్థులు పలువురు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన భారీ వృక్షం



మాచాపూర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని మాచాపూర్‌లో ఓ భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వర్షానికి కూలిన ఇళ్లు

మిరుదొడ్డి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో శుక్రవారం రెండు ఇండ్లు కూలాయి. గ్రామానికి చెందిన వడ్లూరీ రత్నారెడ్డి, దుర్గారెడ్డిల ఇండ్లు వర్షానికి కూలాయి. దీంతో పెనుప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసుకోవాలని బాధితులు కోరారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా లేఖను పంపారు. ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటు పడటంలో భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

'పనులు పూర్తిచేయాలి'

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల తరగతి గదులు, నల్లాల ట్యాబ్‌లు, మరుగుదొడ్ల పునఃనిర్మాణ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మాలతి కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామ హైస్కూల్‌ను సందర్శించి పనులను పరిశీలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దశంకరంపేటలో, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శుక్రవారం ఎంఈవో వెంకటేశం పూలమాలలు, శాలువాలు, మమెంటోలతో సన్మానించారు. అలాగే జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు, ఎంఆర్‌సీ సిబ్బందిని ఎంఈవో వెంకటేశం సన్మానించారు.

మహిళా సంఘాలకు శిక్షణ

మనోహరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రంలో రైతు వేదికలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మెదక్ అదనపు డీఆర్డీవో సరస్వతి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా 'కలిసి నేర్చుకుందాం, సంపదను పెంచుకుందాం' అనే అంశంపై శిక్షణ నిర్వహించారు.

'రాష్ట్రస్థాయిలో రాణించాలి'

చేగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో గెలుపొందిన బాల, బాలికలు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఎంఈవో నీరజ పేర్కొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు పంపిణీ చేసి మాట్లాడారు.

అర్హులందరికీ పథకాలు

జోగిపేట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ శేరి జగన్‌మోహన్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్, జోగిపేట మున్సిపల్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో 19 మందికి కల్యాణలక్ష్మి, ముగ్గురికి షాదీముబారక్ చెక్కులు, 1,121 మందికి నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డికి సతీవియోగం



పుణ్యవతి (ఫైల్)

అల్లాదుర్గం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ శేరి దుర్గారెడ్డికి సతీవియోగం కలిగింది. మండలంలోని గడిపెద్దాపూర్‌కు చెందిన దుర్గారెడ్డి భార్య శేరి పుణ్యవతి(70) కొన్నిరోజులుగా అనారోగ్యానికి గురై గురువారం రాత్రి కన్నుమూశారు. ఆమె మృతదేహానికి అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింలు, జాగృతి నాయకులు కృష్ణాగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.

వ్యక్తి అదృశ్యం

మనోహరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బ్యాగరి నర్సింహులు(48) టెంట్‌హౌస్‌లో పనిచేస్తాడు. ఈనెల 11న భార్య హేమలత, కుమారుడు హేమంత్ పనికెళ్లి తిరిగొచ్చేసరికి నర్సింహులు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం భార్య హేమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలకు నిలయంగా బాలికల వసతి గృహం

- వారంరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు బంద్
- హాస్టల్ ఆవరణలో అపరిశుభ్రత
- నీరు రాక విద్యార్థినుల ఇబ్బందులు

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మోర్గి మోడల్ బాలికల వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. 60 మందికిపైగా ఉన్న విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. వసతి గృహంలో పదిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, హాస్టల్‌లోని వాటర్ ట్యాంకులో పురుగులు పేరుకుపోయాయి. ఈ నీటిని తాము ఎలా వాడుకోవాలో చెప్పాలని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. హాస్టల్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి, విష సర్పాలు వచ్చే అవకాశం ఉన్నదని భయాందోళన చెందుతున్నారు. ఈ సమస్యలపై హాస్టల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటితో పాటు హాస్టల్ సమస్యలను తీర్చాలని వారు కోరుతున్నారు.



నాగల్‌గిద్ద మండలం మోర్గి మోడల్ బాలికల వసతి గృహం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు



బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హాస్టల్ గృహాన్ని సందర్శించిన భూపాల్‌రెడ్డి

మండల పరిధిలోని మోర్గి మోడల్ బాలికల వసతి గృహాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా సబ్ కలెక్టర్ ఉమాహారతి వసతి గృహాన్ని అధికారులతో కలిసి సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ, ఎంపీడీవో మహేశ్వర్‌రావు ఉన్నారు.

ఏడీఈలకు షాక్

(5వ పేజీ తరువాయి)

గతంలో ఇబ్రహీంబాగ్, హైదరాబాద్‌లోని స్టోర్‌లో పనిచేసి, ప్రస్తుతం పటాన్‌చెరులోని ఫోకల్ ఏరియాలో విధులు నిర్వహిస్తున్నాడు.

ఫోకల్ టూ ఫోకల్ బదిలీలు

సాధారణంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ప్రాంతాలకు బదిలీ చేస్తారు. అయితే ట్రాన్స్‌కోలో కొందరు అధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి ఆదాయం ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లోనే ఏళ్ల తరబడి తిష్టవేస్తున్నారు. ట్రాన్స్‌కో సంస్థలో అధిక ఆదాయం వచ్చే ప్రాంతాలను 'ఫోకల్' అని, ఆదాయం తక్కువగా ఉండే ప్రాంతాలను 'నాన్ ఫోకల్' అని వర్గీకరించారు. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డి డివిజన్లు ఫోకల్ ఏరియాలుగా గుర్తించబడ్డాయి. అయితే నారాయణఖేడ్, జోగిపేట డివిజన్‌లు నాన్ ఫోకల్‌గా ఉన్నాయి. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రామచంద్రాపురం, బొల్లారం, పటాన్‌చెరు, గుమ్మడిదల సబ్ డివిజన్లు ఉండగా, సంగారెడ్డి డివిజన్ పరిధిలో ఇస్నాపూర్, సదాశివపేట, సంగారెడ్డి ఉన్నాయి. ఇలాంటి ఫోకల్ ఏరియాల్లోనే కొందరు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు పెద్దఎత్తున ముడుపులు చెల్లించి, ఏళ్ల తరబడి కీలక స్థానాల్లో కొనసాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కాంగ్రెస్ చేసిందేమీ లేదు : ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/మాసాయిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లకు దగ్గరవుతున్నా గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇప్పటికీ కేటాయించకపోవడంతో గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. శుక్రవారం సాయంత్రం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో కౌడిపల్లి మండలం దేవులపల్లికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలన అధ్వానంగా మారిందని, పాలనపై పట్టు లేకపోవడంతో పాటు అవగాహనారాహిత్యంతో రాష్ట్రం దివాళా తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, పలువురు పాల్గొన్నారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మాసాయిపేట మండలంలో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, ఇళ్లపై పంచాయతీ కార్యదర్శులతో రైతువేదికలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విఘ్నేశ్వర్, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

విజయరామరాజు సేవలు చిరస్మరణీయం

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మల్కాపూర్‌లో విజయరామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మాజీ జడ్పీటీసీ దివంగత విజయరామరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని మల్కాపూర్‌లో శుక్రవారం విజయరామరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, మాజీ ఎంపీటీసీలు దత్తు, దామోదర్ పాల్గొన్నారు.

లక్ష్మి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడండి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కేసు పెట్టిందని ఆత్మహత్యకు పాల్పడిన కొండి లక్ష్మి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. ఈ విషయంలో పోలీసులు, సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ఎస్సీ సబ్సిడీలో భాగంగా తక్షణ సహాయం అందించాలని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు కర్రె ప్రకాశ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో చిన్నారెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటయ్య

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

రామాయంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పీఎం ఆవాస్ యాప్ సర్వే ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. శుక్రవారం రామాయంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రతీ పనికి సంబంధించిన రికార్డులు మెయింటెనెన్స్ సక్రమంగా చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సహజరుద్దీన్ ఉన్నారు.

డా.ప్రవీణ్‌కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి



డా.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్(అకాడమిక్ లెవల్-12)గా విధులు నిర్వహిసున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్(అకాడమిక్ లెవల్-13ఏ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం డా.ప్రవీణ్‌కుమార్‌ను ప్రిన్సిపల్ డా.హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విధుల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ ఉన్న అధ్యాపకుడు ప్రవీణ్‌కుమార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి : జడ్పీ సీఈవో

నిజాంపేట/నారాయణఖేడ్/కౌడిపల్లి/చిన్నశంకరంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల నిర్మాణాల్లో వేగం పెంచే విధంగా చూడాలని ఎంపీడీవో సంగ్రాం అధికారులకు సూచించారు. ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకుల ఇసుకను అందిస్తామని పీడీ మాణిక్యం అన్నారు. శుక్రవారం కౌడిపల్లి మండల పరిధి ముత్రాజ్‌పల్లిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో దామోదర్ పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.



నిజాంపేటలో నిర్మాణ పనుల పరిశీలిస్తున్న ఎల్లయ్య

మాదకద్రవ్యాల తయారీ చేపట్టొద్దు

- తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

మనోహరాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల యాజమాన్యాలు మాదక ద్రవ్యాల తయారీ చేపట్టొద్దని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. శుక్రవారం సీఐ రంగా కృష్ణ ఆధ్వర్యంలో పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరిశ్రమలు అనుమతులు ఒక్కటి తీసుకుని, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల తయారీ చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్‌గౌడ్, పరిశ్రమ కమిటీ అధ్యక్షుడు శ్రావణ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

వారాంతపు సంతలో పారిశుధ్య లోపం

- వేతనాలు రాక కార్మికుల విధుల బహిష్కరణ
- పేరుకుపోయిన చెత్తాచెదారం

శివ్వంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు రావడం లేదని పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించడంతో వారాంతపు సంతలో పారిశుధ్యం లోపించింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కాగా రెండునెలల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



వారాంతపు సంతలో పేరుకుపోయిన సంత

కల్వర్టుపై భారీగా వరదనీరు

- రాకపోకలకు అంతరాయం



చందంపేట-రుద్రారం వంతెనపై వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. శుక్రవారం రుద్రారం-చందంపేటకు వెళ్లే కల్వర్టు బ్రిడ్జి వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్కూల్ పిల్లలను మరో దారి నుంచి వాహనాల్లో పంపించారు. వరద ఉధృదొడె వంతెనకు అడ్డంగా కంచెలు ఏర్పాటు చేసి, హెచ్చరికలు జారీచేశారు. కాగా వరద ఉధృతిని ఎంపీడీవో దామోదర్, పంచాయతీ కార్యదర్శి పద్మ పరిశీలించారు. మిర్జాపల్లితండాకు వెళ్లే రోడ్డు నీటి ప్రవాహంతో ఏర్పడిన పెద్ద గొయ్యిని కూడా వారు పరిశీలించారు. గొయ్యిని పూడ్చి రాకపోకలకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని తెలిపారు.

పేదల ఆరోగ్యానికి వరం సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందజేస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి ప్రయోజనకరంగా మారుతోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురంలో 11 మంది లబ్ధిదారులకు రూ.5,79,500 మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. నిరుపేదల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. నిరుపేదలు పూర్తిస్థాయి వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు మంజూరవుతున్నాయన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత



ఆలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న గోదావరి

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శుభ్రత పాటించడం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. శుక్రవారం భారతీనగర్ డివిజన్ పరిధి రామాలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పిచ్చిమొక్కలు తొలగించారు. ఆహ్లాదకరంగా ఉండేటట్టు తీర్చిదిద్దారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరిసరాల్లో మొక్కలు లేకుండా చూసుకోవాలని కోరారు. నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షురాలు రజని, నందారెడ్డి, నారాయణ, మహిపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, మోహన్, కిశోర్ పాల్గొన్నారు.

రోగాలపై జాగ్రత్తలు తీసుకోవాలి : కార్పొరేటర్



కార్మికులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం జలమండలి పారిశుధ్య సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. డివిజన్ పరిధి మ్యాన్‌హోల్స్, మురుగు లీకేజీలు, వరద కాలువలను శుభ్రం చేయాలని చెప్పారు. మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారకుండా చూసుకోవాలని కోరారు. వరద కాలువలకు చుట్టుపక్కల రక్షణ కవచం నిర్మించాలని చెప్పారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శివకృష్ణ, మేనేజర్ అరుణ్ పాల్గొన్నారు.

కాగజ్‌మద్దూర్ టీచర్‌కు ధర్మనిధి పురస్కారం

నర్సాపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రతియేటా అందజేసే రంగనాయకమ్మ ధర్మనిధి పురస్కారం అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఆచార్య శివారెడ్డి, కార్యదర్శి చెన్నయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు సుమతీనరేంద్ర చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు.

'ప్రజలకు చేరువ కావాలి'

జిన్నారం/నారాయణఖేడ్/మనోహరాబాద్/పాపన్నపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా చేపట్టిన సేవాపక్షంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిన్నారం ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నారాయణఖేడ్ మున్సిపల్ పరిధి మంగల్‌పేట దుర్గాభవానీమాత ఆలయ సమీపంలోని జాతీయ రహదారికి ఇరుపక్కలా పొదలు, చెత్తను తొలగించారు. సరస్వతీ శిశుమందిర్ పాఠశాలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్నం లలితామాణిక్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి హనుమాన్ ఆలయం వద్ద సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్, మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్‌చారి ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హత్నూర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయమని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీతో పాటు కాసాల, దేవులపల్లి, దౌల్తాబాద్‌లోని గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు.

గురుకులానికి పుస్తకాలు

- మాజీ జడ్పీటీసీ పుట్టినరోజు సందర్భంగా..

నర్సాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి కుమారుడు, మాజీ జడ్పీటీసీ శేషసాయిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుమారు రూ.70 వేలతో 119 పుస్తకాలను గిరిజన గురుకుల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ విద్యాపరంగా ఎంతో వెనుకబడి ఉన్న ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న గిరిజనుల కోసం అప్పటి ఎమ్మెల్యే చిలుముల విఠల్‌రెడ్డి ప్రత్యేక కృషిచేసి ప్రముఖ సినీ నిర్మాత రామనాయుడు సహకారంతో రాష్ట్రంలోనే జన్మభూమిలో అప్పట్లో మొదటి గిరిజన గురుకులం ఏర్పాటు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శేషసాయిరెడ్డి, మాజీ ఎంపీపీలు జ్యోతిసురేష్‌నాయక్, సావిత్రిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీటీసీ నగేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఫైన్ ఆర్ట్స్‌కు చెందిన ఓ విద్యార్థి సుహాసినిరెడ్డి ఫొటోను కేవలం పెన్సిల్‌తో అద్భుతంగా పెయింటింగ్ వేసి బహుమతిగా అందజేశాడు. ఈ సందర్భంగా విద్యార్థిని సుహాసినిరెడ్డి అభినందించారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సుహాసినిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

పాత పథకానికి కొత్త పేరా..! : బీఆర్ఎస్వీ

హత్నూర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు పంపిణీ చేసే బతుకమ్మ చీరలను ఇందిరమ్మ పేరుతో పంపిణీ చేయొద్దని బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి అర్జున్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మను పురస్కరించుకుని ఆడపడుచులకు బతుకమ్మ చీరలను కానుకగా పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇందిరమ్మ చీరల పేరుతో కాకుండా బతుకమ్మ చీరల పేరుతోనే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణచారి, సాయి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.